క్లుప్తంగా

కనీస సౌకర్యాలు కల్పించాలి



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: పట్టణ ప్రజలకు కనీస సౌకర్యాలైన రోడ్డు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సూచించారు. పట్టణంలోని పలు వార్డులను బుధవారం ఆయన సందర్శించారు. ప్రజలు ఆ వార్డుల్లోని సమస్యలు విన్నవించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ముందస్తు అరెస్టు



కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నాయకులు

బెల్లంపల్లిరూరల్(తాండూర్)/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి పెద్దపల్లి జిల్లా పర్యటనలో భాగంగా ఎలాంటి నిరసనలు చేపట్టకుండా తాండూర్,భీమిని, హాజీపూర్ మండలాల బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. బుధవారం తెల్లవారుజామునే బీఆర్‌ఎస్ నాయకుల ఇళ్ల వద్దకు పోలీసులు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్లకు తరలించారు. సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచి సొంతపూచికత్తుపై వదిలిపెట్టారు.

‘ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం’



మాట్లాడుతున్న శ్రీదేవి, వెంకటకృష్ణ

బెల్లంపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల అమలులో పూర్తిగా విఫలం అయ్యిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకురాలు అమురాజుల శ్రీదేవి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ అన్నారు. బెల్లంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం బెల్లంపల్లి నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పథకాల అమలుతో ప్రజలను మోసం తీరుకు నిరసనగా రాష్ట్రంలో, బెల్లంపల్లిలో నెలకొన్న సమస్యలపై చార్జిషీట్ విడుదల చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, నాయకులు కేశవరెడ్డి, కల్యాణి, శైలందర్, సంపత్, రామన్న, సంతోష్, కమల, సంగీత, శ్రావణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి



కార్మికులతో మాట్లాడుతున్న రఘునాథ్

మందమర్రిరూరల్: ఈ నెల తొమ్మిది లోగా పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సూచించారు. ఏరియాలోని కేకే–5 గనిని బుధవారం సందర్శించి త్వరలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంతో కార్మికులతో మాట్లాడారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు దీక్షితులు, శ్రీనివాస్, నరేష్ తదితరులు ఉన్నారు.

సీఎం సభకు ఉద్యోగ అభ్యర్థులు



సీఎం సభకు తరలివెళ్తున్న ఉద్యోగ అభ్యర్థులు

శ్రీరాంపూర్: పెద్దపల్లిలో జరిగిన సీఎం సభకు సింగరేణి ఉద్యోగ అభ్యర్థులు తరలివెళ్లారు. శ్రీరాంపూర్ ఏరియాకి చెందిన ఎక్స్‌ట్రనల్ ద్వారా సెలక్ట్ అయిన 36మంది, కారుణ్య ఉద్యోగాల కింద 74మందికి ఉద్యోగ నియమాకపత్రాలు అందించారు. బుధవారం ఉదయం జీఎం కార్యాలయం వద్ద అభ్యర్థులందరినీ అధికారులు పిలిపించి వారిని ప్రత్యేక బస్సుల్లో పెద్దపల్లికి తీసుకెళ్లారు.

బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా

మందమర్రిరూరల్: రెండో జోన్‌లోని ఎస్సీ బాయ్స్ కాలేజ్ హాస్టల్‌ను బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించారు. వారిని లోనికి వెళ్లనీయకపోవడంతో గేటు ఎదుట ధర్నా చేశారు. బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.

పార్‌పల్లి ఐకేపీ సెంటర్‌లో కొనుగోలు చేయకపోవడంతో పేరుకుపోయిన ధాన్యం రాశులు



కొనుగోళ్లలో జాప్యం..!

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కరువు
- టార్పాలిన్లు కూడా అందుబాటులో లేని వైనం
- మబ్బులతో ఆందోళన చెందుతున్న రైతులు
- వర్షం కురిస్తే నష్టపోతామని ఆవేదన

ఫెంగల్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా ఆకాశం మబ్బులు పట్టి ఉంది. జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు కూడా పడ్డాయి. ఈ నేపథ్యంలో వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల వద్ద కనీసం టార్పాలిన్లు కూడా అందుబాటులో లేకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. తేమ పేరు చెబుతూ నిర్వాహకులు కొనుగోళ్లు ఆలస్యం చేయడంపై అన్నదాతలు మండిపడుతున్నారు. జిల్లాలోని పలు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ‘సాక్షి’ విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

టార్పాలిన్ కవర్లు లేవు..



మార్కెట్ యార్డులో నిలిచిపోయిన ధాన్యం

లక్సెట్టిపేట: మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కేంద్రంలో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో ధాన్యం తడిసింది. అన్నదాతలు మళ్లీ ఆరబెడుతున్నారు. అధికారులు పట్టించుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

గన్నీసంచులు చినిగి ఇబ్బంది



చినిగిన సంచి చూపుతున్న నిర్వాహకురాలు..

దండేపల్లి: మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 32 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలకు సరఫరా అవుతున్న గన్నీ సంచులు చినిగినవి రావడంతో నిర్వాహకులు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. తూకం వేయడం కొంత ఆలస్యం అవుతున్నాయి. ఆకాశం మేఘావృతంగా ఉండటంతో ధాన్యంలో తేమశాతం తగ్గడం లేదు. ధాన్యం ఆరబోసేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. గన్నీ సంచులు మంచివి తెప్పించాలని రైతులు, నిర్వాహకులు కోరుతున్నారు.

సౌకర్యాలు నిల్..



చింతలపల్లి వద్ద రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. కనీసం పందిరి కూడా వేయలేదు. తాగునీటి సౌకర్యం కల్పించలేదు. టార్పాలిన్లు లేవు. ధాన్య ఆరబోయడానికి సరైన స్థలం కూడా లేదు. ఇక చింతలపల్లిలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు జాతీయ రహదారిపై ధాన్యాన్ని ఆరబోస్తున్నారు.

పేరుకుపోయిన నిల్వలు



షెట్‌పల్లి కొనుగోలు కేంద్రంలో..

జైపూర్: మండల వ్యాప్తంగా 20గ్రామ పంచాయతీల్లో డీసీఎంఎస్, ఐకేపీ, పీఏసీఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ధాన్యం నిలవలు పేరుకుపోయాయి. సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో లేవు. అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసిపోయింది.

ధాన్యం రాలే..!



కాసిపేట: మండలంలోని మల్కేపల్లిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం 15రోజుల క్రితం ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు కేంద్రం వద్దకు రైతులు ధాన్యం అమ్మడానికి తీసుకురాలేదు. సన్నవడ్లు వేయడంతో సొంతంగా బియ్యం పట్టించుకుంటున్నారు. కొనుగోలు కేంద్రం వద్దకు రైతులు వడ్లు తీసుకురాకపోవడంతో మంగళవారం మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ గ్రామాల్లో తిరిగి అవగాహన కల్పించడంతో పాటు సన్నరకాలకు ప్రభుత్వం రూ.500బోనస్ చెల్లిస్తున్నట్లు తెలిపారు.

రైతుల అవస్థలు..

కోటపల్లి: ఆరుగాలం శ్రమించి పండించిన రైతుకు అమ్ముకోవడానికి ఎన్నో అవస్థలు పడుతున్నారు. పార్‌పల్లిలో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సన్నరకం వడ్లు కొలిచేందుకు మిషన్ లేకపోవడంతో కొనుగోలు చేయడంలేదని రైతులు వాపోతున్నారు. తుఫాన్ భయంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కప్పుకునేందుకు టార్పాలిన్లు కూడా ప్రభుత్వం అందించడంలేదని రైతులు వాపోయారు. వేగంగా కొనుగోలుచేయాలని వేడుకుంటున్నారు.

అన్నదాతల పడిగాపులు

భీమిని: అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంటను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. బుధవారం ఉదయం చిరుజల్లులు కురవడంతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మరికొందరు రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ధాన్యం కొనుగోళ్లు జరపడానికి జాప్యం చేస్తున్నారు. దీంతో రైతులు ధాన్యం వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోంది.



కన్నెపల్లిలో...

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



కొత్తూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ అధికారులు

నెన్నెల: అడవికి నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని కొత్తూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సతీష్ అన్నారు. నీల్వాయి రేంజ్ అధికారి అప్పలకొండ ఆదేశాల మేరకు బుధవారం కొత్తూర్‌లో వన్యప్రాణులు, అటవీ పంటలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అటవీ ప్రాణులు, అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని వాటిని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. విద్యుత్ తీగలు అమర్చి ఉచ్చులు బిగించి వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జలీల్, అటవీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వేమనపల్లి: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఆర్‌వో అప్పలకొండ అన్నారు. మండలంలోని నీల్వాయి, కేతన్‌పల్లి గ్రామాల్లో బుధవారం వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ప్రమోద్‌కుమార్, ఎఫ్‌బీవోలు మైపాల్, ప్రవంతి, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: అడవిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోశ్ పేర్కొన్నారు. ఎంపీడీవో ఆఫీస్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అడవిలో చెట్లను నరికినా, వన్యప్రాణులను వేటాడినా పెద్ద నేరమన్నారు.

దాడికి నిరసనగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఉత్సవ సమితి సభ్యులు

మంచిర్యాలఅర్బన్: బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంచిర్యాలలో ర్యాలీ నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి కలుగజేసుకుని హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలన్నారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రవీందర్, కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, యాదవసంఘం అధ్యక్షుడు తిరుపతి, తులా మధుసూధన్, మున్నరాజాసిసోడియా, హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

జన్నారం: క్రీడలు మానసికోల్లాసానికి దోహద పడుతాయని, విద్యార్థి దశ నుంచే క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలం ఇందన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు లాంగ్‌జంప్, హై జంప్ పోటీలు ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడల వల్ల శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేందర్, సెక్షన్ అధికారి రవి, పిడి శివనూరి తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘క్రీడల్లో గెలుపోటములు సహజం’

కోటపల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడాస్ఫూర్తితో మెలగాలని మాజీ జెడ్పీవైస్ చైర్మన్ మూలరాజిరెడ్డి అన్నారు. కోండంపేటలో నిర్వాహకులు నీల మనోహర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో మాజీజెడ్పీవైస్ చైర్మన్ మూలరాజిరెడ్డి పాల్గొని గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, నాయకులు భూమయ్య, వెంకన్న పాల్గొన్నారు.



కోటపల్లి: బహుమతి అందిస్తున్న రాజిరెడ్డి

వైభవంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దంపతులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం రాత్రి అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ ఆధ్వర్యంలో సామూహిక దివ్య పదునెట్టంబడి పడిపూజా, కోటి పుష్పాభిషేకం వైభవంగా జరిగింది. కేరళ శబరిమలై మాలిక పురోత్తామదేవి మెల్‌శాంతి తిరుమేణి మురళీ నంబూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దుర్గామాతా పీఠాధిపతి శ్రావణానంద చిన్నస్వామి హాజరయ్యారు. శాసనసభ్యుడు ప్రేమ్‌సాగర్‌రావు దంపతులు, సిర్పూర్ శాసనసభ్యుడు పాల్వాయి హరీష్‌బాబు, మాజీ శాసనసభ్యుడు దివాకర్‌రావులు స్వామి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ఘనంగా ఆరట్టు



శ్రీరాంపూర్: ఆర్కే 6 కొత్తరోడ్‌లోని భక్తాంజనేయ స్వామి ప్రాంగణంలోని అయ్యప్ప కుటీరానికి చెందిన స్వాములు ఆరట్టు ఘనంగా నిర్వహించారు. గురువారం అయ్యప్ప పడి పూజ నిర్వహిస్తున్న నేపథ్యంలో బుధవారం నస్పూర్ గోదావరినదిలో ఉత్సవ విగ్రహాలకు పుణ్యస్నానాలు చేయించారు. కార్యక్రమంలో గురుస్వాములు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

జైపూర్: మండల కేంద్రంలో గల భూనీల సమేతా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు భూదేవి, శ్రీదేవి సమేతా శ్రీ వేంకటస్వామి స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మహోత్సవాన్ని వీక్షించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నెన్నెల: మండలంలోని నెన్నెల, కుశ్నపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి కల్పన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వలు, ఎరువుల స్టాక్ రిజిష్టర్ బిల్లు బుక్‌లను పరిశీలించారు. ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల స్టాక్ బోర్డులను డీలర్లు రైతులకు కనబడే విధంగా ప్రదర్శించాలన్నారు. డీలర్లు యూరియా కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు యూరియాతో పాటు ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం కుశ్నపల్లిలో వరి కోస్తున్న రైతుల వద్దకు వెళ్లి వరి పంట మోళ్లను, కొయ్యలను కాల్చవద్దన్నారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల నేలలో ఉండే సేంద్రియ కార్బనం, పంట పెరుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశించి పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని అవగాహన కల్పించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, తేమ శాతం 17కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని రైతులకు వివరించారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారిణి సృజన, ఏఈవోలు రాంచందర్, సుప్రజ ఉన్నారు.



తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి కల్పన

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి సైకిల్‌పోలో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ తెలిపారు. గతనెల 30న కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఎనిమిది మంది క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. ఈ నెల 27నుంచి 30వరకు తమిళనాడులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో అంబాజీ, ఏటీడీవో పురుషోత్తం, పీడీ బండ జీవరత్నం పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు పరిధిలోని ముధిరాజ్ కాలనీలో ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. చెత్త చెదారం రోడ్లపై వేయొద్దని అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

శిక్షణ కేంద్రం ప్రారంభం

పాతమంచిర్యాల: దేశవ్యాప్తంగా ప్రజలకు సేవలందిస్తూ జీవిత భీమా సంస్థ అగ్రగామిగా నిలిచిందని, ఎల్‌ఐసీ సౌత్ సెంట్రల్ జోన్ రీజినల్ మేనేజర్ ఉతుఫ్‌జోసఫ్ అన్నారు. జిల్లా కేంద్రంలో నూతన టెక్నాలజీతో ఏర్పాటు చేసిన మోడ్రన్ ఎల్‌ఐసీ ఏజెంట్ల శిక్షణా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.

బోర్లకు భూమిపూజ

కాసిపేట: దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో బోర్లు మంజూరు చేసి బుధవారం కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ గ్రామ పెద్దలతో కలిసి బోర్లకు భూమిపూజ చేశారు. వేసవి కాలంలో నీటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సీఎస్ఆర్ నిధులతో ఆరు బోర్‌లు మంజూరు చేసినట్లు తెలిపారు. సీనియర్ జీఎం హెచ్‌ఆర్ ఆనంద్ కులకర్ణి, సివిల్ అధికారులు ఉన్నారు.

‘ఎస్సీ వర్గీకరణకు అడ్డువస్తే ఊరుకునేది లేదు’

మందమర్రిరూరల్: ఎస్సీ వర్గీకరణ తీర్పుకు అడ్డువస్తే ఊరుకునేది లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య హెచ్చరించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్ట్ ధర్మాసనం ఇచ్చిన తీర్పునే వ్యతిరేకిస్తూ మంద కృష్ణమాదిగపై ఎమ్మెల్యే వివేక్ పలు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.

‘మాలలను రెచ్చగొడుతున్నారు’

జైపూర్: చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి మాలలపై ఎప్పుడూ లేని ప్రేమను చూపి, ఎస్సీవర్గీకరణ అడ్డుకోవడానికి మాలలను రెచ్చగొడుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ భీమారం మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ ఆరోపించారు. భీమారం మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రజా పాలనపై కళాజాత

నెన్నెల: మండలంలోని ఆవుడం, జెండావెంకటాపూర్, చిత్తాపూర్ గ్రామాల్లో బుధవారం సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఆట, పాటల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు వివరించారు.

ఉపాధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

వేమనపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో కొత్త పనులు గుర్తించి 2025–26ఆర్థిక సంవత్సరం సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: ఈ నెల 10న కంటి శిబిరం నిర్వహిస్తుండగా, జగన్నాథాలయంలో బుధవారం లయన్స్ క్లబ్ పట్టణ అధ్యక్షులు తిరుపతి నేతృత్వంలో పోస్టర్ ఆవిష్కరించారు.

ఆశా కార్యకర్తల ఆందోళన

మంచిర్యాలటౌన్: సమస్యల పరిష్కారానికి ఆశా కార్యకర్తలు బుధవారం ఆశా యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆశా జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.